క్లుప్తంగా

అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీ తిరుపతమ్మ వారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కూచిపూడి నాట్యకారిణులకు సత్కారం



పరిటాల(కంచికచర్ల): తమ కళాశాలలో సాంకేతికతతో కూడిన ఇంజినీరింగ్ విద్యతో పాటు క్రీడా రంగం, నాట్య రంగంలో కూడా విద్యార్థులకు మంచి తర్ఫీదు ఇస్తున్నామని అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. ఇటీవల విజయవాడ నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయ 12వ వార్షికోత్సవ సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు బహుమతులు గెలుచుకోగా శుక్రవారం కళాశాలలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ కళలకు ప్రపంచంలో మంచి ప్రాచుర్యం ఉందని, దేశ సాంస్కృతిక కళా వైభవాన్ని దశదిశలా చాటే విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ పి.చిరంజీవి, అధ్యాపకులు, హెచ్‌ఓడీ పాల్గొన్నారు.

నేడు పట్టణంలో వలంటీర్లకు వందనం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థినులకు కోలాటంలో శిక్షణ



జగ్గయ్యపేటఅర్బన్: పౌర గ్రంథాలయ సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ అన్నారు. శుక్రవారం గ్రంథాలయంలో శిక్షణ తరగతుల్లో భాగంగా ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిష్ గ్రామర్ నేర్పించారు. బీడీసీ మల్లిక ఆధ్వర్యంలో విద్యార్థులకు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.

వార్డుల్లో బోరు పంపుల మరమ్మతులు



జగ్గయ్యపేటఅర్బన్: మండిపోతున్న ఎండలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా పట్టణంలో ఎక్కడైనా కుళాయిలు గాని, బోరు పంపులు గాని మరమ్మతులకు గురైతే వెంటనే తెలియజేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఒకటవ వార్డు యానాదుల కాలనీలో శుక్రవారం ఒక బోరు పంపు పనిచేయకుండా ఆగిపోయింది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ ప్రభాకర్ బోరు పంపును యుద్ధప్రాతిపదికన బాగుచేయించారు. స్థానిక ఆరవ వార్డు కాకానినగర్‌లో తాగునీటి పైపులైన్ వాల్వు పనిచేయకపోవడంతో దానికి కూడా తక్షణమే మరమ్మతులు చేయించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు?



ఈ నిర్లక్ష్యం ఏమాత్రం క్షమార్హం కాదు... నడిరోడ్డుపై తాగి పడేసిన కొబ్బరి బొండాలు మూట ప్రయాణికులకు ప్రాణసంకటంగా పరిణమిస్తోంది. పురపాలకులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం ఎంతో శ్రద్ధతో కృషిచేస్తున్నా...పారిశుద్ధ్య కార్మికులు ఎండనకా, వాననకా పనిచేస్తున్నా... కొందరు వ్యాపారుల నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తోంది. పట్టణంలో శుక్రవారం ఈ కారణంగా ఓ వ్యక్తి ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. ఒకరి నిర్లక్ష్యం వేరొకరికి ప్రాణాంతకం కాకూడదు సుమా. -నందిగామ

ట్రామాకేర్ సెంటర్ స్థల పరిశీలన



స్థల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సమన్వయకర్త స్వప్న

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో ట్రామాకేర్ సెంటర్ స్థలాన్ని శుక్రవారం ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్త స్వప్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. చిల్లకల్లు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే విజయవాడ వెళ్లేందుకు సమయం పడుతోందని, ఈ ప్రాంతంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే క్షతగాత్రుల పరిస్థితి విషమించకుండా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కంచికచర్ల: వేసవి కాలంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ ముందుగా తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన కలిగించటంతో పాటు తెలుగు భాషా పరిజ్ఞానం గురించి వివరించారు. విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు కథలతో పాటు డ్యాన్స్‌లు నేర్పించారు. కార్యక్రమంలో నీలం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో కథలు చదువుతున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో జ్ఞానం

పెనుగంచిప్రోలు: పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటు నైతిక విలువలు పెంపొందుతాయని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటంతో పాటు కార్టూన్లు, గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు చదరంగంపై అవగాహన

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ బందరు రోడ్డులోని పీవీపీ మాల్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ఉచితంగా చెస్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గ్లోబల్ చెస్ అకాడమీ కార్యదర్శి, ఫిడే ఇన్‌స్ట్రక్టర్ షేక్ ఖాసీం తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు. అవగాహన సదస్సులో పాల్గొనే వారికి సీనియర్ చెస్ కోచ్‌లతో శిక్షణ ఇస్తామని తెలిపారు. చదరంగంలో రాణించాలనే ఆకాంక్ష ఉన్న క్రీడాకారులు తమ అకాడమీ ఆధ్వర్యంలో జరిగే ఈ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98495 14138ను సంప్రదించాలని కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: హృదయాంజలి బ్లోజమ్స్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాక్టర్ అమలారాణి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సత్యవర్ధన్, సునీల్, డేవిడ్‌రాజు, రమాశంకర్, రామభద్రకుమార్, సింధు, డాక్టర్ భాగ్యశ్రీ పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. సినీ రంగ ప్రముఖులు నటుడు శరత్‌బాబు, సినీ సంగీత దర్శకుడు రాజ్ మృతికి సంస్థ నిర్వాహకులు సంతాపం ప్రకటించారు. సేవా రంగంలో ఈటీవల డాక్టరేట్ పొందిన సీనియర్ గాయని అమలారాణిని నిర్వాహకులు అభినందించారు. సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



తుదిదశకు చేరుకున్న ఆర్బీకే భవన నిర్మాణం

ఎమ్మెల్యే సహకారంతోనే...



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రైతు భరోసా కేంద్రం ప్రారంభం త్వరలో చేపడతాం. జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు వేశారు. అధికారులు తీగలు లాగి మీటర్లు ఇస్తే బాగుంటుంది.

–బి జ్యోతిబ్రహ్మం, సర్పంచ్

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.21 లక్షలు చొప్పున మొత్తం రూ.42 లక్షలతో రెండు కేంద్రాల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు శ్లాబ్ దశలో ఉన్నాయి. వీటికి తోడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు, హిందూ శ్మశాన వాటిక, కాలనీల్లో సుమారుగా కిలో మీటరు మేర గ్రావెల్‌తో రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతోంది.

కనకదుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో అమ్మవారికి నృత్య నీరాజనాలు సమర్పించారు. నటరాజ నృత్య కళానిలయం నిర్వాహకురాలు నాట్యాచారిణి కె.స్వాతివాహిని శిష్య బృందం ప్రదర్శించిన వివిధ అంశాలు భక్తులను తన్మయులను చేశాయి. కూచిపూడి నృత్యం ద్వారా వినాయక కౌతం, బ్రహ్మాంజలి, మహిషాసురమర్దని, శంకర శశిధర, మూషిక వాహన, చూడరండమ్మ సతులార, రామాయణ శబ్దం, భరత వేదముగా.., అగజానన పద్మార్కం, కృష్ణ శబ్దం అంశాలను చక్కని అభినయం..హావభావాలతో నర్తించారు. ప్రభుత్వం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు భక్తులు ప్రశంసించారు.



ఆత్మీయ పలకరింపు

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావుతో మాటా మంతీ...

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు లక్ష్మణరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): విద్యుత్ షాక్‌తో ప్లంబింగ్ వర్క్ చేస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని బీసెంట్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వైఎస్సార్ కాలనీకి చెందిన సుఖవాసి లక్ష్మణరావు ప్లంబింగ్ పనులు చేస్తూ ఉంటాడు. శుక్రవారం ఉదయం బీసెంట్ రోడ్డులో ప్లంబింగ్ పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. 11 గంటల సమయంలో అతని భార్య ఫోన్ చేయగా బీసెంట్ రోడ్‌లో మహమ్మద్ ఖాన్ అండ్ సన్స్ జ్యూవెలరీ షాప్ ఎదురుగా ఉన్న బిల్డింగులో మోటార్ రిపేరు చేస్తున్నానని చెప్పాడు. మళ్లీ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా అతని ఫోన్ ఎవరో లిఫ్ట్ చేసి లక్ష్మణరావుకు విద్యుత్ షాక్ తగిలిందని చెప్పారు. అక్కడ నుంచి వెంటనే హెల్ప్ హాస్పిటల్‌కు, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే లక్ష్మణరావు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పన



జగనన్న లే అవుట్ కాలనీలో మరమ్మతుకు గురైన మోటార్‌ను బాగు చేయిస్తున్న సర్పంచి రవికుమార్

గండేపల్లి(కంచికచర్ల):జగనన్న కాలనీ లే అవుట్‌లో అవసరమైన అన్ని మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని, లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లి జగనన్న కాలనీలో మరమ్మతుకు గురయిన విద్యుత్ మోటార్‌ను శుక్రవారం బాగుచేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ జగనన్న కాలనీ లే అవుట్‌లో రోడ్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఇప్పటికే ప్రభుత్వం కల్పించిందన్నారు. లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన కట్టుకోవాలనే ఉద్దేశంతో సకాలంలో బిల్లులు కూడా చెల్లిస్తోందన్నారు. విద్యుత్ మోటార్ సాంకేతిక కారణంతో మరమ్మతుకు గురవటంతో బాగు చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా

మున్సిపల్ కమిషనర్ జయరాం



పైప్ లైన్ లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నందిగామ: వేసవికాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం తెలిపారు. పట్టణానికి తాగునీటి సరఫరా చేసే పథకాలన్నీ సక్రమంగా పనిచేస్తూనే ఉన్నాయన్నారు. పైప్ లైన్‌లు లేని ప్రాంతాల్లో కూడా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేకంగా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. 20 వార్డుల పరిధిలో ప్రత్యేకంగా హెల్ప్ లైన్ నంబర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. వేసవి కాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలన్నదే లక్ష్యం అని, ఈ తరుణంలోనే ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం రైతు పక్షపాతి

కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రవిశంకర్



మాగల్లు గ్రామంలో రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు అందజేస్తున్న రవిశంకర్, ఏఓ

నందిగామ: ప్రభుత్వం రైతు పక్షపాతి అని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను ఏఓ ఖాసీంతో కలిసి శుక్రవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సర్కార్‌లో వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండేందుకే ప్రతి గ్రామాల్లోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించి సహాయ సహకారాలందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్బీకే సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఏసీపీ జనార్ధననాయుడు



సమావేశంలో సూచనలు చేస్తున్న ఏసీపీ జనార్ధననాయుడు

నందిగామ: డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏసీపీ కె.జనార్ధన నాయుడు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక క్రైమ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్‌కు సంబంధించిన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు తదితర అంశాల గురించి ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సతీష్, రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, జగ్గయ్యపేట సీఐ జానకి రామ్, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్

కంచికచర్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ బట్టు నవీన్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం రైతు భరోసా కేంద్ర ఆవరణలో గురువారం రాత్రి సాయంత్రం–రాత్రి శిబిరం ఎస్‌బీఐ మేనేజర్ ఏసుదాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని వర్గాల ప్రజలకు, ఖాతాదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించి కొత్త రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు తమ బ్యాంకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తుందన్నారు. రైతులకు వ్యవసాయ సంబంధిత ఇన్వెస్ట్‌మెంట్ క్రెడిట్ పథకం కింద కంబైన్డ్ హార్వెస్టర్, హార్టికల్చర్ గార్డినింగ్, డెయిరీ షెడ్‌లు, కమర్షియల్ గోట్ రియరింగ్ యూనిట్స్, గ్రామీణ గోడౌన్‌లు, కోల్డ్ స్టోరేజీలు, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లు, పౌల్ట్రీ ఫారం యూనిట్లకు ఇతోధికంగా రుణాలు ఇస్తామన్నారు. రీజనల్ ఆఫీస్ (సీఎం) సేల్స్ సీహెచ్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన పంట రుణాలు, ట్రాక్టర్ రుణాలు, సంవత్సరం కాలంలో చెల్లించే పంట రుణాలకు నెలకు 100 రూపాయలకు 33 పైసలు చొప్పున వడ్డీతో రుణాలు ఇస్తామని అన్నారు. వ్యాపారాలు చేసుకునే వారికి ముద్ర రుణాలు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, వెలుగు ఏపీఎం కోట భాస్కరరావు, పశువైద్యాధికారి విశ్వనాథ్, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పర్యటలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులకు రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సీ అండ్ డబ్ల్యూ హెడ్ క్వార్టర్స్ బ్రాంచ్ కార్యదర్శి కె.సుకుమార్ వినతిపత్రం సమర్పించారు. కోచింగ్ డిపో పర్యటకు శుక్రవారం రాగా ఎంప్లాయీస్ సంఘ్ నేతలు ఆయన్ను శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ డిపోలో ప్రైమరీ మెయింటినెన్స్ నిర్వహిస్తున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ మచిలీపట్నం తరలివెళ్లిందని, అమరావతి ఎక్స్‌ప్రెస్ మరికొన్ని రోజుల్లో నర్సాపూర్ వెళ్లనుందని, సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ కూడా వేరే డిపోకు తరలివెళ్లిపోతుందని పేర్కొన్నారు. దీంతో కోచింగ్ డిపోలో కార్మికుల నిర్వాహణకు సరిపడా కొత్త రైళ్లను కేటాయించాలని వినతి పత్రంలో ఏజీఎంను కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న విజయవాడ–అజ్మీర్, విజయవాడ–వారణాసి, విజయవాడ–నాగపట్నంకు రైళ్లను కేటాయించాలని, నిర్మాణం పూర్తి చేసుకున్న కోచింగ్ మెయింటినెన్స్ డిపోలో స్టాఫ్ రూమ్, క్యాంటిన్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, 13 ఏళ్లుగా అసిస్టెంట్స్‌గా ఉన్న హెల్పర్, కళాసీలకు టెక్నిషియన్–3 పదోన్నతులు కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏజీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.